క్లుప్తంగా

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి



ఐనవోలు : ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా నందనం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది తాటికొండ కృష్ణమూర్తిని నియమించారు. ఈ మేరకు మహాసభ జిల్లా అధ్యక్షుడు తోట సురేశ్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా కృష్ణమూర్తి పలు సంఘాల్లో సభ్యుడిగా కొనసాగుతూ పలు సేవలు అందిస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన నిర్వహించే భూ భారతి పోర్టల్‌పై రైతులకు అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆదివారం తెలిపారు. సదస్సుకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో వ్యవసాయ బావులవద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ ఆదివారం తెలిపారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఎ.కనుకయ్య, ఎ.శంకరయ్య, అల్లం రాజు, గంజరి శంకరయ్య, నాగవెల్లి రవీందర్, గూడ శంకరయ్య, వెంకటస్వామిలు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 1560 నగదు, 3 సెల్‌ఫోన్‌లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రారంభం

పరకాల : పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. 150 మంది విద్యార్థులకు పరకాల ప్రభుత్వ బాలుర పాఠశాలలో, ఎస్ఆర్ పాఠశాలలో 202 మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రైవేట్ విద్యాసంస్థలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కువ మందికి కేటాయించడంతో చాలా మంది విద్యార్థులు బాలుర పాఠశాలకు చేరుకొని మళ్లీ ఎస్ఆర్ వైపు పరుగులు పెట్టారు. దీంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో గదుల కొరత కారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలో ఎక్కువ మందికి కేటాయించినట్లు పరీక్ష నిర్వహణ అధికారులు తెలిపారు.

నేడు బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్వీకేకె ఫంక్షన్‌హాల్‌లో భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నేడు (సోమవారం)నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రస్థాయి నాయకులు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ తోట పరమేశ్వర్ తండ్రి లింగమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం లింగమూర్తి దశదినకర్మకు మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి హాజరై లింగమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రాజు, వైనాల రాజు, దైనంపల్లి సుమన్, గోలి రఘు, మామిడి అశోక్‌లు ఉన్నారు.

పరకాల : గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరకాల మాజీ జెడ్పీటీసీ సిలువేరు మొగిలిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, నాయకులు సురేందర్‌రావు, చంద్రమౌళి, సుభాష్ తదితరులు ఉన్నారు.

రూ.25వేల గంజాయి స్వాధీనం

వరంగల్: నగరంలోని జెమిని సెంటర్‌లో ఆదివారం ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.25 వేల విలువైన 500గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. నిందితులు కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన జేరిపోతుల జస్వంత్, కుమ్మరి శ్రీమాన్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బస్సు సర్వీస్ లేక ఇబ్బందులు

- వెంకటేశ్వర్లపల్లెకు పునరుద్ధరించాలంటున్న ప్రజలు
- మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

నడికూడ : ఎన్నికలు వస్తే అన్ని ప్రధాన పార్టీలకు పూజకైనా, ప్రచారానికి అయినా వెంకటేశ్వర్లపల్లె నుంచే మొదలుపెట్టడం సెంటిమెంట్. కానీ గెలిచిన తర్వాత మాత్రం ఆ పల్లె బాధలు ఎవరూ పట్టించుకోరు. అలాంటి గ్రామానికి బస్సు సర్వీస్ లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలల నుంచి పరకాల నుంచి వయా, చర్లపల్లి, నార్లపూర్, వెంకటేశ్వర్లపల్లె, మరిపెల్లిగూడెం, మల్యాల, ఇల్లంతకుంట మీదుగా జమ్మికుంటకు రోజుకు 4 ట్రిప్పులు ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను నిలిపివేశారు. నిత్యం ప్రజలు, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇటు నార్లపూర్ వరకు, అటు మరిపెల్లిగూడెం వరకు నడుస్తూ వెళ్లి నానా తిప్పలు పడుతూ బస్సు ఎక్కాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ప్రజాప్రతినిధులు, అధి కారులు రోడ్ల గురించి పట్టించుకోకపోవడం లేదు. రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు బస్సు నడపలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రజలు, విద్యార్థులు పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చొరవ తీసుకొని వెంకటేశ్వర్లపల్లెకు బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వెంకటేశ్వర్లపల్లెలో ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు (ఫైల్)



బస్సు రూట్‌లో రోడ్డును పరిశీలిస్తున్న డిపో మేనేజర్ రవి (ఫైల్)

ఆదాయం రాక రద్దు చేశాం..

గత సంవత్సరం జూన్‌లో పరకాల నుంచి జమ్మికుంటకు వయా చర్లపల్లి, నార్లపూర్, వెంకటేశ్వర్లపల్లె, మరిపెల్లిగూడెం, మల్యాల, ఇల్లంతకుంట మీదుగా నాలుగు నెలలు రోడ్లు బాగులేకున్నా గ్రామస్తుల కోరిక మేరకు బస్సు సర్వీస్ నడిపాం. కానీ ప్రజలు తమ సొంత, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ఆర్టీసీ బస్సును ఆదరించకపోవడంతో ఆదాయం రాక సర్వీస్‌ను రద్దు చేశాం.

– రవి, డిపో మేనేజర్, పరకాల

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



ఏ చిన్న పని ఉన్నా పరకాల, జమ్మికుంటకు పోవాల్సిందే. బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్డు మరమ్మతులు చేసి పల్లెకు బస్సు సర్వీసు వచ్చేలా చేయాలి.

– రామలింగు, వెంకటేశ్వర్లపల్లె

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

- కల్లానికి వచ్చిన ధాన్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

ఐనవోలు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్, గర్మిళ్లపెల్లి గ్రామాల్లో ఐకేపీ, నందనం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా ఈజీఎస్ నిధులు రూ.1.05 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించడానికి రూ.500 బోనస్ అందిస్తున్నాం అన్నారు. ఒక్క ఏడాదిలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేయడంతో పాటు ఉచిత కరెంట్, రైతుభరోసా తదితర పథకాల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడూ ఎలా వస్తుందో తెలియనందున కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తడవకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. 17 శాతం మాత్రమే తేమ ఉండాలని, బస్తాకు 41 కిలోలు మాత్రమే తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాయకులు కట్టా మనోజ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కరుణాకర్, వ్యవసాయ అధికారులు, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

- అగ్నిమాపక శాఖ అధికారి భద్రయ్య
- ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



మాట్లాడుతున్న అధికారి భద్రయ్య

పరకాల: అగ్నిప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మేలని పరకాల అగ్నిమాపక శాఖ అధికారి వక్కల భద్రయ్య అన్నారు. అగ్నిమాపక దళ వారోత్సవాల ముగింపు వేడుకలను ఆదివారం కార్యాలయం ఆవరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల కారణంగా దేశసంపద అనవసరంగా నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిస్తే ఆస్తి నష్టాన్ని తగ్గించుకోవడంతో పాటు ప్రమాదం ఎక్కువ కాకుండా నిరోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా సంక్షేమ పథకాలు

- బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్



మోదీ అభిమాన దంపతులను సన్మానిస్తున్న సంతోష్‌కుమార్, బీజేపీ నేతలు

పరకాల: భారతదేశాన్ని 2047 వరకు వికసిత్ భారత్ లక్ష్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గావ్ చలో బస్తీ కార్యక్రమాన్ని పరకాల పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంతోష్‌కుమార్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ప్రథమ పాత్ర పోషిస్తున్న ప్రధాని మోదీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు నిరంతరం కృషి చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఎర్ర రామన్న, మాజీ కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, మాజీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు మేకల రాజవీర్, బాసాని సోమరాజు, ఆలేటి రాజేష్, బూత్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి: ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘ సభ్యుల పిల్లలకు సంఘ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆదివారం ప్రోత్సాహకాలు అందజేశారు. ఎంసెట్–2024 (మెడిసిన్, డెంటల్, ఫార్మా–డీ మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.20వేలు, ఇంజనీరింగ్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్/ హార్టికల్చర్/ నర్సింగ్ రూ.15 వేలు 112 మందికి రూ.17,30,000 విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలను డాక్యుమెంటరీ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బహుమతుల కార్యక్రమం 2008లో పారంభించి 2024 వరకు 1,355 మందికి ఇప్పటి వరకు రూ.1,22,53,500 అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జనరల్ మేనేజర్ రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు కడారి ఆదామ్, కార్యవర్గ సభ్యులు కంకల భాగ్య, కూన కనుకయ్య, మారుపాటి జయపాల్‌రెడ్డి, అంబాల రాములు, గజ్జి వీరయ్య, బేల కనకమ్మ, కంది రవీందర్‌రెడ్డి, ఈర్ల మూగయ్య, మహేందర్, శ్రీనివాస్, బుచ్చయ్య, బాషు, వీరన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతోనే బెదిరింపులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేలేరు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలతోనే కాంగ్రెస్ నాయకులు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలే కొన్ని రోజుల నుంచి మండలానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు వారి స్థాయిని మరిచి బీఆర్ఎస్ నాయకులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత బీఆర్ఎస్ నాయకులను పెట్రోల్ పోసి తగలబెడుతామని మీడియా సాక్షిగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడుల వ్యూహం ఎమ్మెల్యే శ్రీహరి కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. ఎమ్మెల్యే కడియం బీఆర్ఎస్ నాయకుల కష్టంతో గెలిచి నేడు వారిపైనే కేసులు పెట్టిస్తున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్ ,బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, జానీ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

ఆత్మకూరు : సికింద్రాబాద్‌లో నేడు (సోమవారం) జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోకన్వీనర్ పాడిశెట్టి గణేష్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ కొమురయ్య అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల డిమాండ్ల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాయంపేట మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్, నాయకులు రంగు మహేందర్, ఇర్సడ్ల సదానందం, నాగెల్లి సామెల్, లక్కర్సు లింగమూర్తి, ఎండీ.బాబువియా, మిర్యాల కుమార్, పైడి, గణపతి, ఎర్రన్న, గజ్జి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలించిన అధికారులు



మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుస్మిత

వేలేరు : అకాల వర్షానికి పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. శనివారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న మామిడి తోటలను జిల్లా ఉద్యాన శాఖ హన్మకొండ డివిజన్ అధికారి సుస్మిత, ఇతర అధికారులు ఆదివారం ప రిశీలించారు. మండలంలో అకాల వర్షంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని బాలుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మణివర్ధన్

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొజ్జ మణివర్ధన్ రోడ్డు దాటుతున్న క్రమంలో గల్లిలో నుంచి ఆకస్మాత్తుగా వచ్చిన బైక్ ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108 సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి బాలుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్–భీంపల్లి గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌కు చెందిన ఎడ్ల క్రాంతికుమార్ సింగరేణి ఉద్యోగి. ఢిల్లీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న తన అన్న ఎడ్ల కరుణాకర్‌ను కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించడానికి కమలాపూర్ నుంచి బైక్‌పై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉప్పల్–భీంపల్లి గ్రామాల మధ్యకు వెళ్లగానే మండలంలోని కన్నూరు (కొత్తపల్లి)కి చెందిన దుర్గం కుమారస్వామి కారు డ్రైవర్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై వెళ్తున్న క్రాంతి కుమార్, కరుణాకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 ద్వారా వరంగల్ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ప్రకాష్ (ఫైల్)

ఐనవోలు : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాగంటి ప్రకాష్(46), సురేందర్ అన్నదమ్ములు శనివారం రాత్రి హనుమకొండ నుంచి ఐనవోలుకు బైక్‌పై వస్తుండగా ఐనవోలు మండలంలోని లక్ష్మీపురం స్టేజీ వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గా యాలపాలైన సురేందర్, ప్రకాష్‌లను బంధువులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి వి షమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఆదివారం ఉ దయం చికిత్స పొందుతూ తమ్ముడు ప్రకాష్ మృతి చెందాడు. సురేందర్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రకాష్ భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అసలేం జరిగిందనే విషయంపై ఎవరికి స్పష్టత లేదు. ఈ ఘటనపై ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పరకాల : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు చిన్ననాటి స్నేహితులను ఒకే వేదికగా కలుపుతూ.. నాటి పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకునేలా చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. పట్టణంలోని జెడ్పీహెచ్‌కు చెందిన 1968– 69 పదోతరగతి బ్యాచ్, అలాగే వెల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్ 2004–05 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఆదివారం నిర్వహించుకున్నారు.

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల జెడ్పీఎస్ఎస్ 1998–99 బ్యాచ్,పీచర జెడ్పీఎస్ఎస్ 2011–12 బ్యాచ్ విద్యార్థులు జరుపుకున్నారు.

కమలాపూర్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1992–93 బ్యాచ్ విద్యార్థులు ఉమామహేశ్వరి గార్డెన్స్‌లో జరుపుకున్నారు.

దామెర : మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరుపుకున్నారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–2002 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన చిన్ననాటి మిత్రులు కలుసుకున్నారు.



కమలాపూర్ : 32 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పరకాల : వెల్లంపల్లిలో



పరకాల : 70 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు



వేలేరు : పీచర పాఠశాలలో వేదికపై కూర్చున్న పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు



దామెర : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేలేరు : మల్లికుదుర్లలో..

వేలేరులో ఘనంగా ఈస్టర్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు కిరణ్,బాలశౌరి

వేలేరు : మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాథలిక్ చర్చి విచారణ గురువు ఫాదర్ ఎర్ర కిరణ్ కుమార్, రెవరెండ్.బాలశౌరి ఆధ్వర్యంలో పులిగుట్ట వద్ద ఈస్టర్ ఆరాధనలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అన్ని అన్నారు. ప్రభువు చూపిన మార్గము ప్రేమ, శాంతి,సహనం,పరస్పర సహకార గుణాలను ప్రతీ ఒక్కరు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్యాసింజర్లపై దురుసు ప్రవర్తన

- మధ్యలో దింపిన మహిళా కండక్టర్

నడికూడ: నడికూడ నుంచి వరంగల్‌కు వెళ్లే చివరి బస్సు ట్రిప్పులో మండల కేంద్రంలో నలుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు ఆర్టీసీ బస్సు ఎక్కి టికెట్ కోసం ఆధార్‌కార్డు చూపే విషయంలో సదరు ప్రయాణికులతో మహిళ కండక్టర్ దురుసుగా మాట్లాడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం కండక్టర్ గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు ఇదే బస్సులో ప్రయాణిస్తున్నారు. వారు కండక్టర్‌కు మద్దతుగా ప్రయాణికులతో గొడవ పెట్టుకున్నారు. మల్లారెడ్డిపల్లె గ్రామ శివారులో రాత్రి 7:40కి బస్సును ఆపి నలుగురు మహిళలు, ఇద్దరు పిల్లలను మార్గమధ్యలో దింపేశారు. కాగా వారు ములుగు రోడ్డు వరకు వెళ్లాల్సి ఉండగా ఈ గొడవ జరుగుతున్న సమయంలో చిన్నారులు ఏడుస్తూ ఉన్న వీడియో స్థానికంగా వైరల్ అయింది.